భక్తిశ్రద్ధలతో ధనుర్మాస మహోత్సవాలు



చార్మినార్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ ద్వియ ప్రభంద ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పూసల బస్తీలోని శ్రీ పద్మావతి అలవేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ శోభక్రుత్ నామ ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ పూజలు జరుగుతున్నాయని వేద పండితులు కోమాండూరి శ్రీధరాచార్యులు తెలిపారు. ఈనెల 17 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజా కార్యక్రమాలు వచ్చే నెల 14 వరకు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనాలుంటాయన్నారు.

ఘనంగా భక్త కనకదాస్ జయంతి



గోల్కొండ: భక్త కనకదాస్ జయంత్యుత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. కురుమ సోదరులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా ఉండి పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలన్నారు. కురుమల ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో ముందుండేలా అవసరం ఉందని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్ కృష్ణభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దేవర వంశీ, దేవర చంద్రకాంత్, దర్పల్లి నర్సింహులు, మల్లన్న, హనుమాన్, సురేష్, ప్రభు పూజారి తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు చెన్నయ్యగారి సరిత ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సరం కేలండర్‌ను చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం నూతన కేలండర్‌ను ఆమెతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీకి ఆమె చిత్ర పటాన్ని కూడా అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న రాజు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఆర్.రాజు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో శుక్రవారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు ముదిరాజ్ మాట్లాడుతూ..ఆరు గ్యారంటీ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కార్యదర్శి వెంకటేష్ ముదిరాజ్, ప్రవీణ్ కుమార్, బోయ నగేష్‌ల సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం



పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలంగాణ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జీ పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకోని కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఆనవాయితీ ఉందని, తెలంగాణ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తు వస్తున్నామన్నారు. జనవరి 6వ తేదీ వరకు కొనసాగే ప్రజా పాలన సభలు విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అర్హులైన వారందరు దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, జి.కిషన్ తదితరులున్నారు.

ఎగ్జిబిషన్‌లో వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ



ఆర్.సుఖేష్‌రెడ్డి

అబిడ్స్: జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సందర్భంగా సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ వలంటీర్స్ కన్వీనర్ ఆర్.సుఖేష్ రెడ్డి వెల్లడించారు. ఎగ్జిబిషన్‌లో వలంటీర్లకు ఆయన ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. వలంటీర్లతో సమావేశమై ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తగిన సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈనెల 24 నుంచి ఎగ్జిబిషన్‌లో వలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండి రక్షణ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 18వ తేదీ వరకు వలంటీర్లు ప్రతి నిత్యం 24 గంటల పాటు మైదానంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం వేళల్లో 135 మంది వలంటీర్లు, రాత్రి వేళల్లో 72 మంది వలంటీర్లు విధుల్లో ఉంటారన్నారు. వలంటీర్లకు ఇప్పటికే బేగంబజార్ ఎస్‌ఐ సాయితేజ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు.

ఆంగ్ల సంవత్సర వేడుకలకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు

సుల్తాన్‌బజార్: ప్రాశ్చాత్త సంస్కృతి అయిన నూతన ఆంగ్ల సంవత్సరాన్ని భారతీయులు నిర్వహించకుండా తెలుగు సంవత్సరం అయిన ఉగాది పండగను చేసుకోవాలని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం బజరంగ్‌సేనా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఉగాదిని కొత్త సంవత్సరంగా వేడుకలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు. జనవరి 1న హ్యాపీ న్యూ ఇయర్ అంటూ భారత పౌరులు ఉత్సవాలు నిర్వహించుకోవడం మన భారతీయ సాంస్కృతి కాదన్నారు. సునీల్ అగర్వాల్, మనోజ్, కాజల్, అభినయ్ తివారి, వీరేందర్, శైలజ, సౌరభ్, ప్రవీణ్‌యాదవ్, రామేశ్వర్ మిశ్రా పాల్గొన్నారు.



జాంబాగ్‌లో.. కాంగ్రెస్ నాయకులు లడ్డు సుభాష్



ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించిన గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు సంతోష్ గుప్తా



గోషామహల్ కేంద్రాన్ని సందర్శించిన జెడ్సీ వెంకటేష్ దోత్రే, స్పెషలాఫీసర్ గీతా రాధిక, డీసీ బాలయ్య



గోల్కొండ కమ్యూనిటీహాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కౌసర్

‘ప్రజా పాలన’కు దరఖాస్తుల వెల్లువ

- రెండో రోజు అదే జోరు
- కేంద్రాలను సందర్శించిన అధికారులు

అబిడ్స్: ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణ జోరుగా కొనసాగింది. శుక్రవారం జాంబాగ్, అబిడ్స్, గోషామహల్, బేగంబజార్ ప్రాంతాల్లోన్ని ప్రజా పాలన కేంద్రాల్లో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులు అందజేశారు. జాంబాగ్‌లో కాంగ్రెస్ నాయకులు లడ్డు సుభాష్ దరఖాస్తుదారులకు అండగా ఉండి దరఖాస్తులు అందజేశారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వండి..

గోషామహల్ నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ గుప్తా డిమాండ్ చేశారు. గోషామహల్, అబిడ్స్, బేగంబజార్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా పాలన కేంద్రాలను సందర్శించారు.

గోషామహల్ హిందీ నగర్‌లో..

ప్రజా పాలనలో అన్ని కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్ హిందీ నగర్‌లో స్పెషల్ ఆఫీసర్ గీతా రాధిక, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్యలతో కలిసి వెంకటేష్ దోత్రే ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని 24 కేంద్రాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ జోరుగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి గీతా రాధిక, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులు పాదర్శకంగా ఉండాలి

గోల్కొండ: ప్రజా పాలన సభలో పాల్గొంటున్న అధికారులు పాదర్శకంగా వ్యవహరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ప్రజా పాలన సభ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేంద్రం బయట దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీఉజ్జమా, సిద్దిఖ్ తదితరులున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



చాంద్రాయణగుట్ట: రియాసత్‌నగర్ డివిజన్‌లోని రక్షాపురం మోడల్ మార్కెట్ ప్రజా పాలన దరఖాస్తు కేంద్రాన్ని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తులు తీసుకుంటున్న తీరు.. ప్రజల్లో నెలకొన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు సహాయంగా ఉండాలన్నారు. రియాసత్‌నగర్ కార్పొరేటర్ సలీం బేగ్, ఉప్పుగూడ మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ పాల్గొన్నారు.



దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

ప్రజలకు ఉచితంగా దరఖాస్తు ఫారాలు

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి దరఖాస్తు ఫారాలు ప్రజా పాలన సభ జరుగుతున్న కేంద్రం వద్ద ఉచితంగా ఇస్తున్నామని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన హకీంపేట్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాల్‌లలో కొనసాగుతున్న ప్రజా పాలన కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న మహిళలకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. నాయకులు అలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

బస్తీల్లో సహాయ కేంద్రాలు..

నాంపల్లి: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మహ్మద్ ఫిరోజ్ ఖాన్ నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకునేందుకు సామాజిక సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగానే ప్రజా పాలన కేంద్రాల్లో ప్రజలకు తన క్యాడర్ సహాయాన్ని అందజేస్తున్నారు. బస్తీల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి నిరక్షరాస్యులైన మహిళలు, పేదలకు ఉచితంగా అందజేశారు. వెంకటేష్, ప్రసన్న, అశోక్, నరేష్, లావణ్య, బుక్కా రమేష్, ఎం.మహేష్, రవి, శంకర్, నర్సింహ, బాలరాజు, లక్ష్మణ్‌లాల్, పృద్వీరాజ్, తీరత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్



ఆసిఫ్‌నగర్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్



గౌలిపురా డివిజన్‌లో..



మిత్రా క్లబ్ కేంద్రంలో..

చాదర్‌ఘాట్‌లో..

సుల్తాన్‌బజార్: ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శుక్రవారం ప్రజా పాలన 2వ రోజు చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్, కోఠి ఫిరోజ్‌గాంధీ పార్కు వద్ద నిర్వహించారు. ప్రజలు వివిధ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో భాగంగా బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దరఖాస్తు ఫారాల పంపిణీ..

గౌలిపురా: గౌలిపురా మిత్రా క్లబ్ కేంద్రంలో యాకుత్‌పురా కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కె.రవిరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు దరఖాస్తు పత్రాలను పంపిణీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు యాదవ్, శశి యాదవ్, మామిడాల శ్రీనివాస్, నళిని గౌడ్, మాజీద్ పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా డివిజన్‌లోని హనుమాన్‌నగర్, అంబికానగర్, పటేల్‌నగర్, దానయ్యనగర్ బస్తీలలో పేదల కోసం దరఖాస్తు కౌంటర్ వద్ద కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మామిడి కృష్ణ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకుడు శశి యాదవ్, శ్యాంరావు తదితరులకు పేదలకు దరఖాస్తు పత్రాలను పంపిణీ చేసి.. అవసరమైన వారి దరఖాస్తు ఫారాలలో వివరాలను పొందు పరిచారు.



పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సైదులు ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

సమాజ సేవే వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ లక్ష్యం

అబిడ్స్: సమాజ సేవకు వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ నిరంతరం పాటుపడుతుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ ఆధ్వర్యంలో మదర్ ఛైల్డ్ ఫీడింగ్ సెంటర్‌ను కోట్రికే భాస్కర్ గుప్తాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..వాసవీ క్లబ్ హైదరాబాద్ నగరంలోనే కాక పలు జిల్లాల్లో కూడా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పేద బడుగు వర్గాల ప్రజలతో పాటు సమాజంలో ప్రజల శ్రేయస్సే ముఖ్యంగా భావించి వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ సంస్థ పలు విభాగాలలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు వెన్నంటుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోట్రికే భాస్కర్ గుప్తా, ఖుష్రో షహాఖాన్, అధ్యక్షులు కొత్తూరు జయప్రకాష్ రామ్, కార్యదర్శి మ్యాడం దయాకర్ గుప్తా, కోశాధికారి మహంకాళి దివాకర్, కూరెళ్లి సూర్యప్రకాష్, బూర్గు రామకృష్ణ, కొత్తపల్లి రాజేందర్, బాల్‌రాజ్, శ్రీనివాస్, విజయానంద్ పాల్గొన్నారు.



మదర్ ఛైల్డ్ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కోలేటి దామోదర్‌గుప్తా, కోట్రికే భాస్కర్ గుప్తా

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి



జైనులూద్దీన్ (ఫైల్)

సంతోష్‌నగర్: పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్న ఘటనలో గాయాలకు గురైన ఓ హోంగార్డ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శివచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్ జమాల్ కాలనీకి చెందిన అహ్మద్ జైనులూద్దీన్(38) కొంత కాలంగా హోంగార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న తలాబ్‌కట్టలో నివాసం ఉంటున్న సోదరీ వద్దకు జైనులుద్దీన్ భార్యతో కలిసి వెళ్లాడు. ఈ సందర్భంగా ఆర్థిక సమస్యలపై చర్చించుకొని తిరిగి వచ్చారు. ఈ కారణంగానే మనస్తాపానికి గురైన జైనులుద్దీన్ ఈనెల 25న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలోని ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జమాల్‌పూర్ మహేశ్వర్‌జీ మృతి



జమాల్‌పూర్ మహేశ్వర్‌జీ

జియాగూడ: జమాల్‌పూర్ మహేశ్వర్ ఆయన నివాసంలో గురువారం మృతి చెందారు. 66 ఏళ్ల పైబడిన జమాల్‌పూర్ మహేశ్వర్‌జీ వృత్తిరీత్యా ఎస్ఎఫ్‌సీలో సీనియర్ టెక్నీషియన్‌గా పదవి విరమణ చెందారు. బీఎంఎస్‌లో ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ఎస్‌సీలో హౌసింగ్ సొసైటీలో సెక్రెటరిగా, అనుశక్తినగర్ కో ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్‌లో భాగ్ బస్తీ యోజన ప్రముఖ్‌గా సైకిల్‌పై ప్రయాణం చేస్తూ ఎన్నో బాల సంస్కరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడంలో ముందుండే జమాల్‌పూర్ మహేశ్వర్‌జీ అకాల మృతి చెందడంతో జియాగూడలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

లెమన్ స్కైలో కొత్త సంవత్సర వేడుకలు



నిర్వాహకులు తమశ్రీ రాయ్ చౌదరి, రుషికారెడ్డి కొత్తపల్లి

అబిడ్స్: లెమన్ స్కై మోడ్రన్ డైనింగ్ మల్టీ చైనీస్ రెస్టారెంట్‌లో కొత్త సంవత్సరం వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తమశ్రీరాయ్ చౌదరి, రుషికారెడ్డి కొత్తపల్లి తెలిపారు. అత్తాపూర్ రోడ్డులోని తమ లెమన్ స్కైలో ఈనెల 31న ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి కొత్త సంవత్సరం ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. వివిధ రకాల వంటకాలతో పాటు కనువిందు చేసే మ్యూజిక్, డీజే పాటలతో వేడుకలు నిర్వహిస్తామన్నారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో లెమన్ స్కైను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నట్లు వారు వివరించారు. తమ లెమన్ స్కైల్‌లో టెర్రస్ వ్యూవ్ హైలెట్స్ అద్భుతంగా ఉంటాయని వివరించారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట: మజ్లిస్ పార్టీతోనే జంగమ్మెట్ డివిజన్ అభివృద్ధి సాధ్యమవుతుందని కార్పొరేటర్ ఎం.ఎ.రెహమాన్ అన్నారు. శివగంగానగర్‌లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సహకారంతో గడిచిన ఎనిమిదేళ్లలో జంగమ్మెట్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. నాలాల నిర్మాణం, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు వేస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నాయకులు పులికంటి నరేష్ కుమార్, బస్తీవాసులు కిరణ్‌కుమార్, బాబు, శ్రీహరి, తరుణ్ కుమార్, ఉమా, సుధాకర్, శైలజ పాల్గొన్నారు.

క్రీడలు యువత భవిష్యత్తుకు పునాదులు



విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న విక్రమ్ గౌడ్

సుల్తాన్‌బజార్: క్రీడలు యువత భవిష్యత్తుకు పునాదులని శ్రేష్ట ఫౌండేషన్ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు మూల విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 12 టీమ్‌లు పోటీ పడగా ఫైనల్‌లో ప్రవీణ్ బ్రదర్స్, కింగ్స్ లెవెన్స్ అంబేడ్కర్‌నగర్, జుమ్మేరాత్‌బజార్‌ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో కింగ్స్ లెవెన్స్ విజయం సాధించి ట్రోఫీ దక్కించుకుంది. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన విక్రమ్‌గౌడ్ హాజరై ఫైనల్‌లో విజేతగా నిలిచిన కింగ్స్ లెవెన్స్ టీమ్‌కు రూ.70 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నర్స్‌కు రూ.30 వేల నగదు బహుమతిని అందజేశారు. మిద్యకృష్ణ, ధర్మేందర్, బాలసాయిలు, తిరుమలేష్, లక్ష్మణ్, శివ కుమార్, రాజు, సురేష్ పాల్గొన్నారు.